గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఫ్లై ఓవర్ల పెండింగ్

● కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ/ గచ్చిబౌలి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ నిర్లక్ష్యం, సహకార లోపంతోనే అంబర్‌పేట్, ఉప్పల్ ఫ్లై ఓవర్ల పనులు పెండింగ్‌లో పడ్డాయని కేంద్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. బేగంపేటలోని హరిత ప్లాజా హోటల్‌లో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ సమితి(దిశా) సమావేశం శనివారం నిర్వహించారు. నగరంలో కేంద్రప్రభుత్వ ఆర్థిక సాయంతో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ నగర ప్రజల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో కేంద్ర ప్రభుత్వం రూ.715 కోట్లతో అభివృద్ధి చేస్తున్నప్పటికీ.. రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణలో సహకారం అందించడం లేదని ఆరోపించారు. నాంపల్లి, కాచిగూడ, సికింద్రాబాద్ టెర్మినల్స్‌కు అదనంగా చర్లపల్లి దగ్గర మరో టెర్మినల్ కడుతున్నామని, కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం వద్ద రైల్వేస్టేషన్ నిర్మాణానికి త్వరలోనే భూమిపూజ చేస్తామని తెలిపారు. సమావేశంలో ఎంపీ కె.కేశవ రావు, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రోస్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అడిషనల్ కలెక్టర్ మధుసూదన్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి సురేందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. గచ్చిబౌలిలోని సంధ్య కన్వెషన్ హాల్‌లో చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధిక ఎంపీ స్థానాలు గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, నాయకులు వీరేంద్రగౌడ్, సునీతారెడ్డి, నర్సింహరెడ్డి, యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మనం సైతం' ద్వారా ఆర్థిక సాయం

బంజారాహిల్స్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద కళాకారులను ఆదుకునేందుకు సీనియర్ నటుడు కాదంబరి కిరణ్ 'మనం సైతం' స్వచ్ఛంద సంస్థ ద్వారా ముగ్గురికి ఆర్థిక సాయం అం దజేశారు. రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హెయిర్ స్టయిలిస్ట్, సీనియర్ నటి రంగస్థలం లక్ష్మికి మెరుగైన వైద్యం, కనీస అవసరాల కోసం 25 వేల రూపాయల ఆర్థిక సాయం చేశారు. ఎనుముల విదిష అనే బాలికకు ము క్కుకు సంబంధించిన ఆపరేషన్ కోసం రూ. 25 వేలు, సినీ ఆర్టిస్ట్, డాన్సర్ సూరేపల్లి చంద్రకళ ఉన్నత చదవుల కోసం ఇంగ్లాండ్ వెళ్లడానికి సాయం కోరిగా 25 వేల రూపాయల సాయం అందజేశారు. కాదంబరి కిరణ్ మాట్లాడుతూ.. సినీ పరిశ్రమలో పని చేస్తున్న పేద కార్మికుల కోసం మనం సైతం నెలకొల్పినట్టు చెప్పారు.



ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న ఐటీ శాఖ కార్యదర్శి జయేష్‌రంజన్

విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలి

బేగంపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతలను వెలికితీసేందుకు టెక్నాలజీ ఎగ్జిబిషన్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఐటీశాఖ కార్యదర్శి జయేష్‌రంజన్ అన్నారు. శనివారం బేగంపేటలోని గీతాంజలి పాఠశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన టెక్నాలజీ ఎగ్జిబిషన్‌ను పాఠశాల డైరెక్టర్ గీతా కరణ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన టెక్నాలజీ నమూనాలను జయేష్‌రంజన్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ ఎగ్జిబిషన్ సెంటర్‌లో విద్యార్థులు యానిమేషన్, ఏరోడైనమిక్స్, ఏవియేషన్, స్టీమ్, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ ప్రదర్శనలో విద్యార్థుల మేధస్సు, నైపుణ్యం తనను ఆకట్టుకుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాయా సుకుమారన్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వృద్ధులకు వైద్య పరీక్షలు చేస్తున వైద్యులు

వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం

బంజారాహిల్స్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్‌నెం-14 లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో శనివారం సీనియర్ సిటిజన్స్ కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 60 సంవత్సరాలు పైబడిన వారికి బీపీ, షుగర్‌తో పాటు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేసినట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ భీంరెడ్డి తెలిపారు. ఈ హెల్త్ క్యాంపులో 50 మందికి పైగా సీనియర్ సిటిజన్లు వైద్య పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. మాజీ కార్పొరేటర్ భారతినాయక్, డాక్టర్లు విజయాభాస్కర్, ధనశ్రీనాయుడు, గీతానాగశ్రీతో పాటు రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ విజయకుమారి, బెజవాడ సుబ్బలక్ష్మి, కళావతి నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

హబీబ్స్ హెయిర్ అండ్ బ్యూటీ సెలూన్ ప్రారంభం

బంజారాహిల్స్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): అందం.. ఆకర్షణ అనేది అందరి జీవితంలో భాగంగా మారాయని టాలీవుడ్ నటి స్రవంతి చోకరపు అన్నారు. ఢిల్లీ ఆధారిత వెల్నెస్ చైన్ బ్రాండ్ బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 1 లో నెలకొల్పిన హబీబ్స్ హెయిర్ అండ్ బ్యూటీ బ్రాంచ్‌ను నటి స్రవంతి చోకరపు, హబీబ్స్ ఫౌండర్ హబీబ్‌అహ్మద్, అమ న్ అహ్మద్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నటి స్రవంతి మాట్లాడుతూ అం దం ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తుందన్నారు. సౌందర్య పోషక సేవలు అందరికీ అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ రంగంలో మహిళా యువవ్యాపార వేత్తలను ప్రోత్సహించేందుకు ఫ్రాంఛైజీ లను కూడా ఇస్తున్నట్లు వివరించారు.



నటి స్రవంతికి హెయిర్ స్టైల్ నిర్వహిస్తున్న హబీబ్ అహ్మద్



వస్త్ర ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న నటి రాశిసింగ్

ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్‌లో వస్త్ర ప్రదర్శన

బంజారాహిల్స్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన ఆధునిక.. సంప్రదాయ మేళవింపు కలగలిపిన, స్వాన్ ఫ్యాషన్, లైఫ్ స్టైల్ వస్త్ర ప్రదర్శన టాలీవుడ్ నటి రాశిసింగ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫ్యాషన్ డిజైనర్లు, మహిళా వ్యాపారవేత్తల వస్త్రోత్పత్తులు ఒకే వేదికలో ఏర్పాటు చెయడం అభినందనీయం అన్నారు. ఇక్కడి ప్రదర్శనలో ఉంచిన హ్యాండ్ లూమ్ అండ్ సిల్క్‌తో పాటు విభిన్న రకాల ఉత్పత్తులు ఎంతో ఆకట్టుకునే విధంగా ఉన్నాయన్నారు. ఈ ప్రదర్శన ఆదివారం కొనసాగుతుందని నిర్వాహకులు అంజలిరెడ్డి, స్వాతివేములు తెలిపారు.

విద్యార్థి దశలో లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

హైదరాబాద్ సిటీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే లక్ష్యాలను నిర్దేశించుకోవాలని టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ సూచించారు. నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో తెలంగాణ, గోవా రాష్ట్రాల్లో 8, 9, 10వ తరగతి కన్నడ మీడియం చదివి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విదార్థులకు అవార్డుల ప్రదానోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు.

మహబూబాబాద్ ఎంపీ టికెట్ కోయ వర్గానికి ఇవ్వాలి

పంజాగుట్ట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఎస్టీ రిజర్వ్ మహబూబాబాద్ పార్లమెంటు స్థానాన్ని కోయ, ఆదివాసీ, చెంచు, ఎరకల, నాయక్‌పోడ్, యానాది, తోటి, తదితర సామాజికవర్గానికి చెందిన వారికే ఇవ్వాలని జాతీయ ఆదివాసీ రాజకీయ, అఖిలపక్ష సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. ఆదివాసీల ఉనికిని దెబ్బతీయడానికి రాజకీయ కుట్ర జరుగుతోందని, అన్నిటిని లంబాడీలకు ఇస్తున్నారని జేఏసీ జాతీయ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర ఆరోపించారు. ఈనెల 23న మహబూబాబాద్(మానుకోట) పార్లమెంటు నియోజకవర్గం స్థాయి మేథోమదన సదస్సు జరిగిందన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. అన్ని పార్టీలు ఆదివాసీలను నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. గడిచిన మూడు ఎన్నికల్లో లంబాడీలకు టికెట్ ఇచ్చి తమను విస్మరించారన్నారు. సమావేశంలో జేఏసీ సమన్వయకర్త పొడుగు శ్రీనాథ్, కన్వీనర్ వట్టం ఉపేందర్, రమణాల లక్ష్మయ్య, వట్టం నారాయణ దొర, చీమల వెంకటేశ్వర్లు, పి.సత్యనారాయణ, డాక్టర్ చందా సంతోష్ కుమార్, వాసం రామకృష్ణ, కృష్ణ ప్రసాద్, పి.రత్నం, కుంజ శ్రీనివాస్‌రావు, పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న జేఏసీ నాయకులు



ప్రత్యేక పూజలు చేస్తున్న రుత్వికులు

శతచండీయుత మహాకుంభాభిషేకం

అమీర్‌పేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో 5 రోజుల పాటు నిర్వహించనున్న శతచండీయుత మహాకుంభాభిషేక మహోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. 40 మంది రుత్వికులు, వేద పండితులు, అర్చకులు ఉదయం 5:30 గంటలకు దేవతా అనుజ్ఞ మహాగణపతిపూజ, మహాసంకల్పం, పూర్ణాహుతితో ప్రత్యేక పూజలు ప్రారంభించారు. మొదటి రోజు ఆలయ కార్యనిర్వాహణాధికారి కుంట నాగరాజు దంపతులు, ఆలయ చైర్మన్ సాయిబాబాగౌడ్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కంచికామకోఠి పీఠం నుంచి వచ్చిన రుత్వికులు మహా గణపతి హోమం, నవగ్రహ హోమాలను నిర్వహించారు. ఈ మహోత్సవాలను తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. దేవస్థానమునకు సంబంధించిన ఆర్జిత సేవలను బల్కంపేట టెంపుల్.తెలంగాణ.గౌట్.ఇన్, లేదా హెచ్‌టీపీఎస్://బల్కంపేట టెంపుల్ తెలంగాణ.గౌట్.ఇన్‌లో శతచండీయుత యాగం ఆర్జిత సేవలను నమోదు చేసుకోవాలని సుపరింటెండెంట్ రమేష్ సూచించారు. ఈనెల 31 వరకు అమ్మవారికి బోనాలు సమర్పించడం కుదరదని ఈ విషయమై భక్తులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కిడ్నీ సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

తెలంగాణ గవర్నర్ డాక్టర్ తమిళి సై సౌందరరాజన్




యశోద ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ నెఫ్రాలజీపై అంతర్జాతీయ సదస్సును ప్రారంభించిన గవర్నర్

హైదరాబాద్ సిటీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ జబ్బులపై ప్రజలకే కాదు.. ప్రాక్టిషనర్స్‌కు సమగ్ర అవగాహన ఉండాలని, కిడ్నీ సమస్యలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ గవర్నర్ డాక్టర్ తమిళి సై సౌందర్‌రాజన్ అన్నారు. హైటెక్‌సిటీలోని యశోద ఆస్పత్రిలో అత్యాధునిక క్రిటికల్ కేర్ నెఫ్రాలజీపై అంతర్జాతీయ సదస్సును ఆమె శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంకా చాలామందికి కిడ్నీ జబ్బులపై సరైన అవగాహన లేదన్నారు. అక్యూట్ కిడ్నీ ఇంజరీస్, క్రానిక్ రీనల్ కిడ్నీ ఫెయిలర్ గురించి చాలా మందికి తెలియదన్నారు. వీటిపై అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. యశోద ఆస్పత్రుల డైరెక్టర్, డాక్టర్ పవన్ గోరుకంటి మాట్లాడుతూ.. ప్రజల్లో మూత్రపిండాల వ్యాధులపైన, మూత్ర పిండాల ఆరోగ్యం పైన అవగాహన పెంపొందించడానికి శిక్షణ ఇచ్చేందుకు అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన వైద్య నిపుణులు ఈ సదస్సులో పాలు పంచుకోటానికి ఉత్సాహంగా ముందుకు రావటం హర్షణీయమని అన్నారు. కిడ్నీ వైద్య రంగంలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ అంతర్జాతీయ వైద్య నిపుణులతో వారి అనుభవాలను పంచుకునే విధంగా ఈ ముడు రోజుల అంతర్జాతీయ సదస్సును రుపొందించినట్లు నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రాజశేఖర చక్రవర్తి వివరించారు.

నాలుగున్నర దశాబ్దాల కిందటే చంద్రబాబు పాదయాత్ర

● టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింలు

హైదరాబాద్, జనవరి27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నాలుగున్నర దశాబ్దాల కిందటే తొలి పాదయాత్ర చేశారని పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింలు తెలిపారు. 1978లో కాణిపాకం నుంచి చంద్రగిరి వరకు సుమారు 52 కి.మీ.ల మేర్ల పాదయాత్ర చేసిన ఆయన యువతలో స్ఫూర్తి నింపారని గుర్తుచేశారు. ఆ తర్వాత రైతుల కోసం ఉమ్మడి ఏపీలోని ప్రతీ జిల్లాలో 15 కి.మీ.ల చొప్పున... అనంతరం, 'వస్తున్నా.. మీకోసం' పేరిట రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేశారని వివరించారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం పాదయాత్ర చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా శనివారం, ఎన్టీఆర్‌భవన్‌లో తెలుగు యువత ఆధ్వర్యంలో విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. లోకేశ్ వయస్సుకు అనుగుణంగా 41 అడుగుల ఫ్లెక్సీని ఏర్పాటుచేశారు. 3,132 కి.మీ.లు పాదయాత్ర చేసిన నేపథ్యంలో 3,132 కొబ్బరికాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బక్కని మాట్లాడుతూ.. ఏ ముఖ్యమంత్రి తనయుడు చేయని విధంగా లోకేశ్, పార్టీ కార్యకర్తల కోసం సంక్షేమనిధిని ఏర్పాటుచేసి వారికి అండగా నిలిచారని పేర్కొన్నారు. వైసీపీ పెట్టిన ఇబ్బందులను తట్టుకుని లోకేశ్ తన పాదయాత్ర పూర్తిచేశారని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి అన్నారు. జగన్ పాలనను లోకేశ్ ఎండగట్టారని రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నందమూరి సుహాసిని, జాతీయ అధికార ప్రతినిధి ప్రొఫెసర్ జ్యోత్స్న అన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు

కొటేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

హైదరాబాద్ సిటీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జీవితానుభవాలను కవిత్వంగా మలిచి, ఆ కవిత్వాన్ని మంచి మాటలుగా మార్చి, అందరికీ అర్థమయ్యే సరళమైన భాషలో కొటేషన్లుగా మార్చి క్యాలెండర్ రూపొందించడం స్ఫూర్తిదాయకమని ప్రముఖ దర్శకుడు కే.రాఘవేంద్ర రావు అన్నారు. కొటేషన్‌లను చదువుకోవడానికి వీలుగా కవి కొత్త శ్రీనివాస్ రూపొందించిన 2024 క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ.. 'జీవితమనే మహాభారతంలో కృష్ణుడు నీవే, అర్జునుడు నీవే, జీవన పోరాటంలో యోధుడివి నువ్వే, సారథి నువ్వే, గెలిచి నిలవడానికి వ్యూహం నీదే, ఆయుధం నీదే' అనే కొటేషన్ ఎంతో ప్రేరణాత్మకంగా ఉందన్నారు. శ్రీనివాస్ కొటేషన్‌లు ఎంతో ప్రేరణను ఇస్తాయని, వీటితో జీవితాన్ని ఆదర్శవంతంగా రూపొందించుకోవచ్చన్నారు. సమాజంలో సానుకూల దృక్పథం పెంపొందించడం ఈ క్యాలెండర్ ముఖ్యోద్దేశమని రచయిత కొత్త శ్రీనివాస్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

● జాతీయజెండా అవనతం చేస్తుండగా...



రాజాబిక్ష (ఫైల్)

పేట్‌బషీరాబాద్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): జాతీయ జెండా ఇనుపరాడ్‌ను బయటకు తీస్తుండగా.. ఆ రాడ్‌కి ప్రమాదవశాత్తు పైనున్న విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన రాజాబిక్ష(36) కుటుంబసభ్యులతో కలిసి మేడ్చల్ జిల్లా దేవరయాంజల్ లోని తిరుమల వెంచర్‌లో నివాసం ఉంటూ స్థానికంగా ఉన్న ఓ పరిశ్రమలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు. గణతంత్ర వేడుకల సందర్భంగా శుక్రవారం తిరుమల వెంచర్‌లో కాలనీవాసులతో కలసి జాతీయజెండాను ఆవిష్కరించారు. సాయంత్రం జెండాను అవనతం చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. విషయం గమనించిన స్థానికులు, కుటుంబసభ్యులు కొంపల్లిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. శనివారం భార్య బిస్మిల్లా ఇచ్చిన ఫిర్యాదుమేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'ఉన్నత విద్యామండలిని ప్రక్షాళన చేయాలి'

పంజాగుట్ట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పోరాటం చేసి సాధించుకున్న తెలంగాణలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో సరైన మౌలిక సదుపాయాలు కల్పించకుండా, నిధులు కేటాయించకుండా, నియామకాలు జరపకుండా ఉన్నత విద్యను నిర్వీర్యం చేసిందని గిరిజనశక్తి, ఓయూ జేఏసీ అధ్యక్షుడు శరత్‌నాయక్ ఆరోపించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యనిర్వాహక అధ్యక్షుడు సుబ్బునాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌నాయక్, ఓయూ అధ్యక్షుడు హనుమంతునాయక్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. నల్గొండ జిల్లాలో మహాత్మాగాంధీ, మహబూబ్‌నగర్ జిల్లాలో పాలమూరు, నిజామాబాద్‌లో తెలంగాణ, కరీంనగర్‌లో శాతవాహన విశ్వవిద్యాలయాలు నెలకొల్పిందని తెలిపారు.

త్వరలో టీవీనగర్ సాకారం

యూసుఫ్‌గూడ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): టీవీ రంగంలో ఎన్నో ఏళ్లుగా కృషి చేస్తున్న కార్మికుల కల త్వరలోనే నెరవేరబోతుందని, మరి కొన్నాళ్లలో టీవీనగర్ సాధించబోతున్నామని టీవీ ఫెడరేషన్, తెలుగు టెలివిజన్ రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నాగబాల డి.సురేష్‌కుమార్ తెలిపారు. యూసుఫ్‌గూడ కృష్ణనగర్‌లో తెలుగు టెలివిజన్ రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన 'శ్రీనిలయం' భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన నాగబాల సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. టీవీనగర్ విషయంపై ఇప్పటికే సంబంధిత మంత్రులతో మాట్లాడినట్టు తెలిపారు. అంతే కాకుండా త్వరలోనే రచన, దర్శకత్వం, నటనలో రాష్ట్ర స్థాయిలో అన్ని జిల్లాలో వర్క్‌షాప్ నిర్వహించబోతున్నామన్నారు. మంచిర్యాలలో మూడో వర్క్‌షాప్ పూర్తి చేశామని, నాలుగో వర్క్‌షాప్ నిర్మల్‌లో నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సినీ దర్శకులు రేలంగి నర్సింహారావు, దర్శకులు, సంఘం ప్ర ధాన కార్యదర్శి వీఎన్ ఆదిత్య, ప్రముఖ నిర్మాత రాజ్‌కందుకూరి, తెలుగు టెలివిజన్ ఫెడరేషన్ అధ్యక్షులు కె.రాకేష్, విజన్ ఐఐకే ఇండియా చైర్మన్ పి.విజయ్‌కుమార్, తెలుగు టెలివిజన్ రచయితల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.శ్రీశైల మూర్తి, కె.నరేందర్‌రెడ్డి, కోశాధికారి బి.చిత్తరంజన్‌దాస్, పలువురు సీరియల్ నటి, నటులు, సభ్యులు పాల్గొన్నారు.



సంఘం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న నాగబాల సరేష్‌కుమార్

పెళ్లి పేరుతో యువతికి మోసం!

అడిగితే రూ.6లక్షలు ఇచ్చి మోసపోయిన యువతి

హైదరాబాద్ సిటీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో పెళ్లి సంబంధాల కోసం చూస్తున్నారా? ఫోన్లలోనే సంబంధాలను పక్కా చేసుకుంటున్నారా? జాగ్రత్త పడకపోతే నగరానికి చెందిన ఓ యువతి మాదిరిగా కష్టాల ఊబిలో చిక్కుకునే ప్రమాదం లేకపోలేదు. గతేడాది షాదీ డాట్ కామ్‌లో పెళ్లి సంబంధాల కోసం వెతుకున్న సదరు యువతికి మద్దుగారి చంద్రకాంత్ అనే యువకుడి ప్రొఫైల్ ఆకట్టుకుంది. అతడితో సంప్రదింపులు జరిపింది. తానో పెద్ద డాక్టర్‌నని.. తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లో చెయిన్ ఆస్పత్రుల ఏర్పాటు చేసే ప్రణాళికలో ఉన్నట్లు అతడు గొప్పలు చెప్పడంతో పూర్తిగా నమ్మింది. మంచి సంబంధం కుదిరిందనే సంతోషంలో ఉన్న ఆమెకు అతడు తాను ఇబ్బందుల్లో ఉన్నానని చెప్పుకొన్నాడు. ఫోర్జరీ చేసిన ఏటీఎం స్లిప్పులు, బెల్లంపల్లిలో నిర్మాణంలో ఉన్న ఆస్పత్రికి సంబంధించిన నకిలీ ఫొటోలు చూపించి తాను ఆదాయపన్ను అధికారుల చేతుల్లో చిక్కుకుపోయానని ఆమెకు చెప్పాడు. ఐటీ అధికారులు రూ.25 కోట్లున్న తన ఖాతాను స్తంభింపజేశారని, వారిని మేనేజ్ చేస్తే సమస్య తీరిపోతుందని, ఇందుకు తనకు రూ.6 లక్షలు కావాలని ఆమెను అభ్యర్థించాడు. అతడి మాటలు నమ్మిన ఆ యువతి.. అప్పులు చేసి రూ.6 లక్షలను అతడి ఖాతాకు ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసింది. డబ్బు చేతికొచ్చాక అతడు ఆమెతో మాట్లాడటం మానేశాడు. మోసపోయానని గ్రహించిన యువతి బ్యాంకు స్లిప్పులు, నకిలీ బిల్లులు, ఆస్పత్రులకు సంబంధించిన ఫోర్జరీ పత్రాల ఆధారంగా పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడితో పాటు అతడికి సహకరిస్తున్న మహిళను అరెస్టు చేశారు. చంద్రకాంత్ స్వస్థలం కర్నూలు అని విచారణలో వెల్లడించాడు.

బల్దియా.. ఇదేందయ్యా..!

(3వ పేజీ తరువాయి)

రూ.388 నుంచి రూ.435 వరకు(సర్కిళ్లను బట్టి) చెల్లిస్తున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. 2022లో మరో ఏజెన్సీతో చేసుకున్న అగ్రిమెంట్ ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. రవాణా చార్జీల చెల్లింపు ఒకే విధంగా ఉన్నా.. ప్రాసెసింగ్ రుసుము మాత్రం యేడాది మాత్రమే చెల్లిస్తామని ఒప్పందంలో పేర్కొన్నారు. వ్యర్థాల నిర్వహణలో భాగంగా తయారు చేసే ఇటుకలు, పేవర్ బ్లాక్‌లు, ఇతరత్రా ఉత్పత్తులు విక్రయించి ఆదాయం పొందాలని సూచించారు. ఒకే రకమైన పనికి ఒక్కో ఏజెన్సీతో ఒక్కోలా అగ్రిమెంట్లు కుదుర్చుకోవడంపై గతంలోనే తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలోనే గత కమిషనర్ సదరు సంస్థకు చెల్లింపులు నిలిపేయాలని, మరో ఏజెన్సీ తరహాలోనే ఒప్పందంలో మార్పులు చేసే విషయాన్ని పరిశీలించాలని సూచించారు. దీంతో కొన్నాళ్లపాటు బిల్లులకు సంబంధించిన ఫైళ్లను అధికారులు పక్కన పెట్టారు. కమిషనర్ బదిలీపై వెళ్లిన అనంతరం తిరిగి చెల్లింపులు మొదలయ్యాయి. రెండు ఒప్పందాలను పరిశీలిస్తే ఓ సంస్థకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చే ఉద్దేశం స్పష్టంగా తెలుస్తోందని పౌర సంస్థ ప్రతినిధి ఒకరు అభిప్రాయపడ్డారు. ఇప్పటికే సదరు సంస్థకు రూ.60 కోట్లు చెల్లించినట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. మరో రూ.10-15 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం. ఆ సంస్థకు బిల్లులివ్వొద్దని గత కమిషనర్ చెప్పిన అనంతరమూ చెల్లింపులు జరగడం గమనార్హం. ఇంకో విషయం ఏమిటంటే.. 95 శాతం వ్యర్థాలకు అన్‌క్లెయిమ్డ్(ఎవరివో తెలియని) కేటగిరీలో బిల్లులు చెల్లిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది.

త్వరలో నిమ్స్ నాలుగు వేల పడకల ఆస్పత్రి

● నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

హైదరాబాద్ సిటీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నిమ్స్ నాలుగు వేల పడకల ఆసుపత్రిగా త్వరలో అభివృద్ధి చెందనున్నదని సంస్థ సంచాలకులు నిమ్స్ విశ్వ విద్యాలయ ఉపకులపతి ఆచార్య నగరి బీరప్ప పేర్కొన్నారు. నిజాం వైద్య విజ్ఞాన సంస్థ, వైద్య విద్య అనుబంధ డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్ముందు వైద్య అనుబంధ వృత్తివిజ్ఞాన కోర్సులు పీజీ స్థాయిలో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అత్యంత అధునాతన వైద్య పరికరాలు.. అనుభవజ్ఞులైన అధ్యాపకుల నేతృత్వంలో ప్రపంచ స్థాయి అత్యుత్తమ నాణ్యమైన వైద్య విద్యకి నిమ్స్ పెట్టింది పేరని, ఇక్కడ సీటు రావడం విద్యార్థుల అదృష్టమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శిరందాస్ శ్రీనివాస్, వ్యక్తిత్వ వికాస నిపుణులు మోటివేటర్ ఆనంద్ సిరిప్రగడ, వైద్యులు గంగాధర్ పాల్గొన్నారు.



సమ్మేళనంలో మాట్లాడుతున్న వెంకయ్యనాయుడు

త్వరలో మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్

● మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

నార్సింగ్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): భారతదేశం త్వరలో మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరిస్తుందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. శనివారం మణికొండలో గుంటూరు జిల్లా పిట్టలవానిపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1972-74 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ - సకుటుంబ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 50 సంవత్సరాలు క్రితం ఇంటర్మీడియట్ చదువుకున్న విద్యార్థులు ఇప్పుడు స్వర్ణోత్సవాలు చేసుకోవడం చాలా సంతోషకరమన్నారు. నేడు మన తెలుగు కుటుంబాల్లో తెలుగు తక్కువగా మాట్లాడుతున్నారని, మన భాషను మనమే కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అప్పట్లో చదువుచెప్పిన ఉపాధ్యాయులు సాంబశివరావు, విష్ణుప్రసాద్, వెంకటనారాయణ, కృష్ణంరాజు, సుబ్బయ్యను పూర్వవిద్యార్థులు సత్కరించారు.

వెంకయ్యనాయుడికి ఆకృతి సన్మానం

బంజారాహిల్స్: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పద్మ విభూషణ్ అవార్డుకు ఎంపికైన నేపథ్యంలో శనివారం ఆకృతి సంస్థ సన్మానించింది. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సుధాకర్ మాట్లాడుతూ.. వెంకయ్యనాయుడికి అవార్డు లభించడం తెలుగు ప్రజందరికీ అందిన గొప్ప గౌరవం అన్నారు. వాసవి క్లబ్ స్థాపక అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఆకృతి సహ కార్యదర్శి మహేందర్ పాల్గొన్నారు.

● యూసుఫ్‌గూడ: మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయడుకు పద్మవిభూషన్ అవార్డు వచ్చిన సందర్భంగా ఆయన నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలుపుతున్న జూబ్లీహిల్స్ బీజేపీ నాయకులు బరిగెల జ్ఞానేశ్వర్, పులిరామ్, బడుగు సతీష్, బానుతేజ, చక్రీ, అజాద్ సయ్యద్.



కంటోన్మెంట్ మాజీ ఎమ్మెల్యే మశ్చేందర్ భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి - బేగంపేట, ఆంధ్రజ్యోతి



తహసీల్దార్ వెంకటలక్ష్మితో సమావేశమైన కార్పొరేటర్ సామల హేమ

ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను సర్వేచేయించాలి

● కార్పొరేటర్ సామల హేమ

బౌద్ధనగర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్‌లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను సర్వేచేయించాలని స్థానిక కార్పొరేటర్ సామల హేమ, ముషీరాబాద్ తహసీల్దార్ వెంకటలక్ష్మిని కోరారు. శనివారం మండల కార్యాలయంలో తహసీల్దార్‌తో కార్పొరేటర్ సమావేశమయ్యారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్, విద్యార్థులకు ఉపయోగపడేందుకు లైబ్రరీలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు త్వరగా చెక్కులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గడ్డం ప్రసాద్, కన్నా ఉన్నారు.

కాంగ్రెస్ కమిటీ ఎస్సీసెల్ చైర్మన్‌గా మధుకర్



బౌద్ధనగర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్‌గా బౌద్ధనగర్ అంబర్‌నగర్‌కు చెందిన డి.సాయిమధుకర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్ ప్రీతమ్ శనివారం మధుకర్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మధుకర్ మాట్లాడుతూ ఎస్సీల సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ పదవి రావటానికి కారణమైన కాంగ్రెస్ పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బొడ్డు వినయ్‌కుమార్‌కు ఓయూ డాక్టరేట్



తార్నాక, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌బాద్ జిల్లా డోర్నకల్ మండ లానికి చెందిన బొడ్డు వినయ్‌కుమార్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్‌ను పొందారు. ఓయూలోని డిపార్ట్‌మెంట్ ఎడ్యుకేషన్ విభాగంలో ప్రొ. రవీంద్రనాథ్ కె మూర్తి పర్యవేక్షణలో సెర్టైన్ ఫ్యాక్టర్స్ రిలేటెడ్ టు స్టూడెంట్ ఎంగేజ్‌మెంట్ ఏ స్టడీ అమాంగ్ సీనియర్ సెకండరీ స్కూల్ స్టూడెంట్స్ అనే అంశంపై పరిశోధన పూర్తి చేసినందుకు గాను డాక్టరేట్ పట్టాను అందుకోవడం జరిగిందని శనివారం ఆయన తెలిపారు. తనకు డాక్టరేట్ పట్టా రావడానికి సహకరించిన ప్రొఫెసర్లకు, పరిశోధనా విద్యార్థులకు వినయ్‌కుమార్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.



తెలంగాణతల్లి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న జంపన్న ప్రతాప్‌తో స్థానికులు

ఘనంగా తెలంగాణ తల్లి విగ్రహ వార్షికోత్సవం

బోయినపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని బోయినపల్లి ప్లే గ్రౌండ్ వద్ద ఉన్న తెలంగాణతల్లి విగ్రహం 11వ వార్షికోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన్న ప్రతాప్, జక్కుల మహేశ్వర్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొని తెలంగాణతల్లి విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బోయినపల్లి ప్రాంతానికి చెందిన తెలంగాణ ఉద్యమకారులు వీరారెడ్డి, ప్రభు గుప్తా, మీనాభాస్కర్, మధులతో పాటు పలువురు ఉద్యమకారులను వారు సత్కరించారు. కార్యక్రమంలో స్థానికులు సిరాజ్, అజిత్, షకీబ్, గణేష్, పవన్‌లతో పాటు కంటోన్మెంట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్పోర్ట్స్ డే

మారేడుపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి షేనాయి క్రీడామైదానంలో శనివారం పోస్టర్ బిల్లాబాంగ్ ఇంటర్నేషనల్ హైస్కూల్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్కూల్ చైర్మన్ బి.మహేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్ బి.సునీతారాణిలు పోటీలను ప్రారంభించారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులతో పాటు మెడల్స్ ప్రశంసాపత్రాలు అందజేశారు.



క్రిటికల్ కేర్ నెఫ్రాలజీపై అంతర్జాతీయ సదస్సును ప్రారంభిస్తున్న గవర్నర్

కిడ్నీ సమస్యలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● గవర్నర్ డాక్టర్ తమిళి సై సౌందరరాజన్

హైదరాబాద్ సిటీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ జబ్బులపై ప్రజలకే కాదు.. ప్రాక్టిషనర్స్‌కు సమగ్ర అవగాహన ఉండాలని, కిడ్నీ సమస్యలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ గవర్నర్ డాక్టర్ తమిళి సై సౌందరరాజన్ అన్నారు. హైటెక్‌సిటీలోని యశోద ఆస్పత్రిలో అత్యాధునిక క్రిటికల్ కేర్ నెఫ్రాలజీపై అంతర్జాతీయ సదస్సును ఆమె శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంకా చాలామందికి కిడ్నీ జబ్బులపై సరైన అవగాహన లేదన్నారు. అక్యూట్ కిడ్నీ ఇంజరీస్, క్రానిక్ రీనల్ కిడ్నీ ఫెయిలర్ గురించి చాలా మందికి తెలియదన్నారు. వీటిపై అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. యశోద ఆస్పత్రుల డైరెక్టర్, డాక్టర్ పవన్ గోరుకంటి మాట్లాడుతూ.. ప్రజల్లో మూత్రపిండాల వ్యాధులపైన, మూత్రపిండాల ఆరోగ్యం పైన అవగాహన పెంపొందించడానికి శిక్షణ ఇచ్చేందుకు అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన వైద్య నిపుణులు ఈ సదస్సులో పాలు పంచుకోటానికి ఉత్సాహంగా ముందుకు రావటం హర్షణీయమని అన్నారు. కిడ్నీ వైద్య రంగంలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ అంతర్జాతీయ వైద్య నిపుణులతో వారి అనుభవాలను పంచుకునే విధంగా ఈ మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును రూపొందించినట్లు నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రాజశేఖర చక్రవర్తి వివరించారు.

బల్దియా.. ఇదేందయ్యా..!

(3వ పేజీ తరువాయి)

రూ.388 నుంచి రూ.435 వరకు(సర్కిళ్లను బట్టి) చెల్లిస్తున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. 2022లో మరో ఏజెన్సీతో చేసుకున్న అగ్రిమెంట్ ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. రవాణా చార్జీల చెల్లింపు ఒకే విధంగా ఉన్నా.. ప్రాసెసింగ్ రుసుము మాత్రం యేడాది మాత్రమే చెల్లిస్తామని ఒప్పందంలో పేర్కొన్నారు. వ్యర్థాల నిర్వహణలో భాగంగా తయారు చేసే ఇటుకలు, పేవర్ బ్లాక్‌లు, ఇతరత్రా ఉత్పత్తులు విక్రయించి ఆదాయం పొందాలని సూచించారు. ఒకే రకమైన పనికి ఒక్కో ఏజెన్సీతో ఒక్కోలా అగ్రిమెంట్లు కుదుర్చుకోవడంపై గతంలోనే తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలోనే గత కమిషనర్ సదరు సంస్థకు చెల్లింపులు నిలిపేయాలని, మరో ఏజెన్సీ తరహాలోనే ఒప్పందంలో మార్పులు చేసే విషయాన్ని పరిశీలించాలని సూచించారు. దీంతో కొన్నాళ్లపాటు బిల్లులకు సంబంధించిన ఫైళ్లను అధికారులు పక్కన పెట్టారు. కమిషనర్ బదిలీపై వెళ్లిన అనంతరం తిరిగి చెల్లింపులు మొదలయ్యాయి. రెండు ఒప్పందాలను పరిశీలిస్తే ఓ సంస్థకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చే ఉద్దేశం స్పష్టంగా తెలుస్తోందని పౌర సంస్థ ప్రతినిధి ఒకరు అభిప్రాయపడ్డారు. ఇప్పటికే సదరు సంస్థకు రూ.60 కోట్లు చెల్లించినట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. మరో రూ.10-15 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం. ఆ సంస్థకు బిల్లులివ్వొద్దని గత కమిషనర్ చెప్పిన అనంతరమూ చెల్లింపులు జరగడం గమనార్హం. ఇంకో విషయం ఏమిటంటే.. 95 శాతం వ్యర్థాలకు అన్‌క్లెయిమ్డ్(ఎవరివో తెలియని) కేటగిరీలో బిల్లులు చెల్లిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది.

చిలకలగూడ
అభివృద్ధి ఎక్కడ?

● సికింద్రాబాద్‌కు కూతవేటు దూరంలో మున్సిపల్ మైదానం
● 80 షాపులతో కాంప్లెక్స్.. ప్రతిపాదనలకే పరిమితం
● ఎటుచూసినా చెత్తకుప్పలు, నిర్మాణ వ్యర్థాలు



చిలకలగూడ మునిసిపల్ మైదానం



మైదానంలో చెత్తకుప్పలు, నిర్మాణ వ్యర్థాలు

చిలకలగూడ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌కు కూతవేటు దూరంలో 2600 గజాల్లో, 80షాపులు, వివిధ కార్యాలయాలతో రెండు అంతస్తులతో కళకళలాడుతుండేది చిలకలగూడ మునిసిపల్ కాంప్లెక్స్ కానీ అది శిథిలావస్థకు చేరుకోవడంతో దాన్ని కూల్చి వేశారు. ప్రస్తుతం నిరుపయోగంగా మారి చెత్త కుప్పలు, నిర్మాణ వ్యర్థాలతో కళావిహీనంగా మారింది. ప్రైమ్ ఏరియాలో ఉన్న దీన్ని ప్రజలందరికీ ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు..

1. ఎగ్జిబిషన్ మైదానంగా తీర్చిదిద్దటం.
2. వాకింగ్ ట్రాక్ నిర్మించి పచ్చదనం పెంపు.
3. పీపీఎ పద్ధతిలో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం

ప్రతిపాదనలన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి. ప్రస్తుతం వినాయక విగ్రహాల నిమజ్జనం, బతుకమ్మ వేడుకలు, పలు రకాల ఎగ్జిబిషన్స్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అత్యంత విలువైన స్థలం, ప్రైమ్ ఏరియాలో ఉండడం వల్ల ప్రజలందరికీ ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. వార్డు కార్యాలయం, బస్తీ దవాఖానా, గ్రంథాలయంతో పాటు అందరికీ అవసరమైన ప్రభుత్వ కార్యాలయాలతో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తే బాగుంటుందని స్థానికులు సూచిస్తున్నారు. ఏది ఏమైనా అత్యంత విలువైన ఈ స్థలాన్ని సద్వినియోగం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజలందరికీ ఉపయోగపడేలా ఉండాలి



డంపింగ్ యార్డ్ ప్రతిపాదనలు మానుకోవాలి. దుర్వాసన, అంటురోగాలు ప్రబలే అవకాశముంది. అందరికీ ఉపయోగపడే ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలు చేపడితే బాగుంటుంది. మంచి ప్రైమ్ ఏరియాలో ఉన్న ఈ స్థలాన్ని సద్వినియోగం చేయాలి.

- మేకల సారంగపాణి, బీజేపీ మహంకాళి జిల్లా, ప్రధాన కార్యదర్శి

సద్వినియోగానికి చర్యలు



చిలకలగూడ మునిసిపల్ మైదానం అభివృద్ధికి పలు ప్రతిపాదనలు ఉన్నాయి. అత్యంత ప్రైమ్ ఏరియా కావడం వల్ల ప్రజల అభిప్రాయాలు తీసుకుని అందరికీ ఉపయోగపడేలా సద్వినియోగం చేయటానికి చర్యలు చేపడతాను. వాకింగ్ ట్రాక్ నిర్మాణంతో పాటు పచ్చదనం పెంపు, కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం వంటి అనేక ప్రతిపాదనలు వచ్చాయి.

- టి.పద్మారావుగౌడ్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే

కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

● బేగంపేట ఏసీపీ రామలింగరాజు

బోయినపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణలో నేరస్తులను పట్టుకోవడానికి సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని, ప్రతి ఒక్కరూ తమ కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని బేగంపేట ఏసీపీ రామలింగరాజు పేర్కొన్నారు. కంటోన్మెంట్ బోర్డు ఆరవ వార్డు పరిధిలోని బోయినపల్లి భారతీయ ఎన్‌క్లేవ్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను ఏసీపీ రామలింగరాజు, బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, స్థానిక బోర్డు మాజీ సభ్యుడు పాండు యాదవ్‌లు సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వీలైనంత వరకు తమ ఇళ్ల ఎదుట కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఒక సీసీ కెమెరా 100 కళ్లతో సమానమని ఆయన పేర్కొన్నారు. సీసీ కెమెరాల ద్వారా నేరాలను అరికట్టవచ్చని, నేరస్తులను త్వరగా పట్టుకోవడానికి మేలు చేస్తాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



భారతి అవెన్యూలో సీసీ కెమెరాలపై అవగాహన కల్పిస్తున్న ఏసీపీ రామలింగరాజు, సీఐ లక్ష్మీనారాయణరెడ్డి, పాండుయాదవ్

పోగొట్టుకున్న బ్యాగు బాధితురాలికి అందజేత

● బ్యాగులో బంగారు ఆభరణాలు, పట్టు చీరలు

రెజిమెంటల్‌బజార్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ కానిస్టేబుల్ సమయస్ఫూర్తితో ఆటో నుంచి పడిపోయిన బ్యాగు బాధితురాలికి చేరింది. శనివారం చందానగర్‌కు చెందిన అన్నపూర్ణ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో దిగి ఆటోలో చందానగర్‌కు వెళ్తుండగా సికింద్రాబాద్ ఈస్ట్ మెట్రోస్టేషన్ వద్ద ఆటో నుంచి బ్యాగు రోడ్డుమీద పడిపోయింది. గమనించిన గోపాలపురం ట్రాఫిక్ కానిస్టేబుల్ ప్రభు వెంటనే బ్యాగును తీసుకుని భద్రపరిచాడు. ఈ విషయం ఇన్‌స్పెక్టర్ సైదులుకు సమాచారం అందించి గోపాలపురం లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌లో అందించడానికి వెళ్లగా అప్పటికే బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వచ్చి ఉంది. బ్యాగును బాధితురాలికి అందించారు. బ్యాగులో రూ.5లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, పట్టు చీరెలు ఉన్నట్లు అన్నపూర్ణ తెలిపారు. సమయస్ఫూర్తితో వెంటనే కానిస్టేబుల్ బ్యాగును తన ఆధీనంలోకి తీసుకొని ఉండకపోతే వేరే వాళ్లు తీసుకుని ఉంటే బ్యాగు దొరికేది కాదని బాధితురాలు అన్నపూర్ణ తెలిపారు. కానిస్టేబుల్ సమయస్ఫూర్తిని అభినందించారు.



బాధితురాలికి బ్యాగును అందిస్తున్న కానిస్టేబుల్

విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి

● జాతీయజెండా అవనతం చేస్తుండగా...

పేట్‌బషీరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ జెండా ఇనుపరాడ్‌ను బయటకు తీస్తుండగా.. ఆ రాడ్‌కి ప్రమాదవశాత్తు పైనున్న విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన రాజాబిక్ష(36) కుటుంబ సభ్యులతో కలిసి మేడ్చల్ జిల్లా దేవరయాంజల్ గ్రామంలోని తిరుమల వెంచర్‌లో నివాసం ఉంటూ స్థానికంగా ఉన్న పాలీకెమ్ పరిశ్రమలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గణతంత్ర వేడుకల సందర్భంగా శుక్రవారం తిరుమల వెంచర్‌లో కాలనీవాసులతో కలసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. సాయంత్రం జెండాను అవనతం చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్ళాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు కొంపల్లిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. శనివారం భార్య బిస్మిల్లా ఇచ్చిన ఫిర్యాదుమేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



మృతిచెందిన రాజాబిక్ష ఫైల్

ప్లాస్టిక్ వ్యర్థాలపై విద్యార్థులకు అవగాహన

హైదరాబాద్ సిటీ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జీజీహైస్కూల్, సికింద్రాబాద్ విద్యార్థులకు ప్లాస్టిక్ వ్యర్థాలపై పీసీబీ సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ బోడ నాగేశ్వరరావు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ బాటిళ్లకు బదులు స్టీలు బాటిళ్లు, ప్లాస్టిక్ కవర్లకు బదులు గుడ్డ సంచులు వినియోగించడం ద్వారా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించవచ్చని సూచించారు. విద్యార్థులను గ్రూపులుగా విభజించి, ప్లాస్టిక్‌లో రకాలు, వాటి రీసైక్లింగ్ అంశాలపై చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ ఫ్రీ మేడారం జాతర పోస్టర్‌ను ప్రదర్శించారు. స్వంత వాహనాలను పక్కన పెట్టి, ప్రజారవాణాను వినియోగించుకోవడం ద్వారా రోడ్డుపై వాహనాల సంఖ్య తగ్గి పర్యావరణానికి మేలు జరగడంతోపాటు ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



మేడారం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రాజెక్ట్ అధికారి నాగేశ్వరరావు

మహిళ అదృశ్యం

బోయినపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బోయినపల్లి ఎస్ఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం న్యూబోయినపల్లి సీతారాంపురం శ్రీనివాసనగర్‌కు చెందిన బాలరాజు మేస్త్రీ. 2018లో బాలరాజు స్థానికంగా నివాసముండే లలిత అలియాస్ భవాని(23)ని ప్రేమ వివాహం చేసుకున్నాడు.

వివాహం జరిగి ఆరు సంవత్సరాలు గడుస్తున్నా ఈ దంపతులకు పిల్లలు లేరు. ఈనెల 26న భర్త, మామ అత్తయ్యలు పనికి వెళ్లగా ఇంట్లో ఒంటరిగానే ఉన్న లలిత ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి అదృశ్యమైంది. ఆమె కోసం ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో బాలరాజు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల కళ్లుగప్పి నిందితుడి పరారీ

బౌద్ధనగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వైద్యపరీక్షల కోసం ఓ నిందితుడిని పోలీసులు గాంధీ ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆ నిందితుడు పోలీసుల కళ్లుగప్పి పరారయిన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ మట్టంరాజు, డీఐ శ్రీశైలం నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫలక్‌నుమా జహనుమాకు చెందిన మహ్మద్ అమర్‌ఆలీ గత సంవత్సరం అక్టోబర్ నెలలో జూమ్‌యాప్ ద్వారా ఎస్ఆర్‌నగర్‌కు చెందిన మోహన్‌రెడ్డి వద్ద ఓ కారును అద్దెకు తీసుకున్నాడు. కారు యాజమానికి అద్దె చెల్లించకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఎస్ఆర్‌నగర్ ప్రాంతంలో కారులో తిరుగుతున్న అమర్‌ఆలీ సదరు యాజమానికి కనిపించాడు. కారును ఆపకుండా వేగంగా పంజాగుట్టవైపు వెళ్లగా యాజమాని వెంబడించాడు. అప్పటికే మద్యం సేవించి ఉన్న ఆలీ కారుకు అడ్డువచ్చిన వాళ్లను, వాహనాలను ఢీకొట్టుకుంటు వెళ్లాడు. స్థానికులు అమర్‌ఆలీని పట్టుకుని దేహశుద్ధి చేసి పంజాగుట్ట పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసును నమోదు చేసుకుని రాత్రి పదకొండు గంటల ప్రాంతంలో వైద్యపరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తీసుకువచ్చారు. పోలీసులు వైద్యులతో మాట్లాడుతున్న సమయాన్ని అదనుగా చూసి పోలీసుల కళ్లుగప్పి పారిపోయాడు. తిరిగి చూసేసరికి నిందితుడు లేకపోవటంతో ఎస్కార్ట్ పోలీసులు ఖంగుతిన్నారు. కానిస్టేబుల్ రమేష్ ఫిర్యాదు మేరకు చిలకలగూడ పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అమర్‌ఆలీ కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపినట్టు పోలీసులు తెలిపారు.

త్వరలో నాలుగువేల పడకలు

●నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

హైదరాబాద్ సిటీ : నిమ్స్ నాలుగు వేల పడకల ఆస్పత్రిగా త్వరలో అభివృద్ధి చెందనున్నదని సంస్థ సంచాలకులు నిమ్స్ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య నగరి బీరప్ప పేర్కొన్నారు. నిజాం వైద్య విజ్ఞాన సంస్థ, వైద్య విద్య అనుబంధ డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్ముందు వైద్య అనుబంధ వృత్తి విజ్ఞాన కోర్సులు పీజీ స్థాయిలో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అత్యంత అధునాతన వైద్య పరికరాలు.. అనుభవజ్ఞులైన అధ్యాపకుల నేతృత్వంలో ప్రపంచ స్థాయి అత్యుత్తమ నాణ్యమైన వైద్య విద్యకి నిమ్స్ పెట్టింది పేరన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శిరందాస్ శ్రీనివాస్, ఆనంద్ సిరిప్రగడ, వైద్యులు గంగాధర్, పాల్గొన్నారు.

సాంకేతిక రంగం అభివృద్ధికి ప్రోత్సాహకం

● మంత్రి శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

కీసర, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సాంకేతిక రంగం అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం తగిన ప్రోత్సాహకం అందిస్తుందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం మేడ్చల్ జిల్లా కీసర మండల పరిధిలోని రాంపల్లి దాయరలోని బాల వికాస కేంద్రంలో సామాజిక వ్యాపార స్టార్టప్ సమ్మిట్ ఇంపల్స్-2024 కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అధునాతన ఆలోచనలతో స్టార్టప్ కంపెనీలు సామాజిక మార్పునకు దోహదపడే ఆవిష్కరణలు రూపొందించాలన్నారు. గచ్చిబౌలిలోని పలు కంపెనీలతో స్టార్టప్ పరిశ్రమల అభివృద్ధికి బాల వికాస కేంద్రం ఒప్పందం కుదుర్చుకోవడం శుభపరిణామమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా 60కి పైగా వివిధ రకాల సోషల్ స్టార్టప్‌లు తమ సామాజిక ఆవిష్కరణలు, ఉత్పత్తులు, సేవలను ప్రదర్శించాయి. కార్యక్రమంలో బాలవికాస కేంద్రం వ్యవస్థాపకురాలు బాలథెరిస్సా జింగ్రాస్, అరవింద్ ఐకేర్ సిస్టమ్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేష్ ప్రజ్ఞా, బీవీరాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ చైర్మన్ విష్ణురాజు పాల్గొన్నారు.

త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

● మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

● ఇంటర్మీడియట్ పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవాలు



మాట్లాడుతున్న వెంకయ్యనాయుడు

నార్సింగ్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): భారతదేశం త్వరలో మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరిస్తుందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. శనివారం మణికొండలో గుంటూరు జిల్లా పిట్టలవానిపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1972-74 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ - సకుటుంబ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 50 సంవత్సరాలు క్రితం ఇంటర్మీడియట్ చదువుకున్న విద్యార్థులు ఇప్పుడు స్వర్ణోత్సవాలు చేసుకోవడం చాలా సంతోషకరమని అన్నారు. నేడు మన తెలుగు కుటుంబాల్లో తెలుగు తక్కువగా మాట్లాడుతున్నారని, మన భాషను మనమే కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అప్పట్లో చదువుచెప్పిన ఉపాధ్యాయులు సాంబశివరావు, విష్ణుప్రసాద్, వెంకటనారాయణ, కృష్ణంరాజు, సుబ్బయ్యను పూర్వ విద్యార్థులు సత్కరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల మనవలు, మనవరాళ్ళు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వెంకయ్యనాయుడికి 'ఆకృతి' సన్మానం

బంజారాహిల్స్ : మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పద్మవిభూషణ్ అవార్డుకు ఎంపికైన నేపథ్యంలో శనివారం ఆకృతి సంస్థ సన్మానించింది. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సుధాకర్ మాట్లాడుతూ.. వెంకయ్యనాయుడికి అవార్డు లభించడం తెలుగు ప్రజందరికీ అందిన గొప్ప గౌరవం అన్నారు. వెంకయ్యనాయుడుకి సాహిత్యం, కళలు, కళాకారుల పట్ల ప్రత్యేక గౌరవం ఉందని తెలిపారు. వాసవీ క్లబ్ స్థాపక అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. వెంకయ్య నాయుడుకు పద్మ విభూషణ్ ప్రకటించిన సందర్భంగా యావత్ తెలుగు ప్రజలందరు పులకించిపోయారన్నారు. కార్యక్రమంలో ఆకృతి సహ కార్యదర్శి మహేందర్ పాల్గొన్నారు.

కొటేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



కొటేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దర్శకేంద్రుడు కే.రాఘవేంద్రరావు

హైదరాబాద్ సిటీ : జీవితానుభవాలను కవిత్వంగా మలిచి, ఆ కవిత్వాన్ని మంచి మాటలుగా మార్చి, అందరికీ అర్థమయ్యే సరళమైన భాషలో కొటేషన్లుగా మార్చి క్యాలెండర్ రూపొందించడం స్ఫూర్తిదాయకమని ప్రముఖ దర్శకుడు కే.రాఘవేంద్రరావు అన్నారు. కొటేషన్‌లను చదువుకోవడానికి వీలుగా కవి కొత్త శ్రీనివాస్ రూపొందించిన 2024 క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 'జీవితమనే మహాభారతంలో కృష్ణుడు నీవే, అర్జునుడు నీవే, జీవన పోరాటంలో యోధుడివి నువ్వే, సారథి నువ్వే, గెలిచి నిలవడానికి వ్యూహం నీదే, ఆయుధం నీదే' అనే కొటేషన్ ఎంతో ప్రేరణాత్మకంగా ఉందని అన్నారు. శ్రీనివాస్ కొటేషన్‌లు ఎంతో ప్రేరణను ఇస్తాయని, వీటితో జీవితాన్ని ఆదర్శవంతంగా రూపొందించుకోవచ్చన్నారు. సమాజంలో సానుకూల దృక్పథం పెంపొందించడం ఈ క్యాలెండర్ ముఖ్య ఉద్దేశమని రచయిత తెలిపారు.